# "పెళ్ళయి పోయింది"

## శేషాద్రికి, శాయిలక్ష్మికి పెళ్ళయిపోయిందిట.

నాకు బోల్డంత ఆశ్చర్యంగానూ, అనుమానంగాను వుంది. వాళ్ళిద్దరికి నాకు తెలీకుండా పెళ్ళయిపోయిందంటే విడ్డూరంగా వుంది. ఊళ్ళో ఎవ్వరికి తెలీకుండా పెళ్ళయిపోయిందని వుంది—"ఏదో తిరకాసు వుంది" అనుకొని, ఆలోచించి చివరికి "హమ్మమ్మా! శాయిలక్ష్మి" అనుకున్నాను గుండెల మీద చేయివేసుకొని.

## ఓ ప్రేమకథ

### ఆకెళ్ళ నాగమణి

"ఇంతకీ, శేషాద్రి శాయిలక్ష్మిని పెళ్ళిచేసుకున్నట్టా? లేక శాయిలక్ష్మి శేషాద్రిని పెళ్ళిచేసుకున్నట్టా?" అన్న అనుమానం పీడించింది.

"వెధవ అనుమానం! ఎవరిని ఎవరు పెళ్ళిచేసుకుంటేనేం? పెళ్ళయ్యింది వాళ్ళిద్దరికి" అంది మనసు కసురుకుంటూ వివేకంగా.

"అది తెలుసులేవోయ్! వాళ్ళిద్దరూ అందరిలాకాదు. అందుకే ఎవరు ఎవరిని చేసుకున్నట్టూ?" విసుక్కుంటూ మెత్తగా మందలించాను మనసును.

రెండురోజులు ఎంత ప్రయత్నించినా ఆఫీసునుండి త్వరగా ఇంటికి రాలేక పోయాను. నాలుగేళ్లు కాలేజీలో చదివితే డిగ్రీ—ఓ గుమాస్తా ఉద్యోగంతో పాటు, ప్రతిరోజు వేడివేడిగా అయ్యారు హోటల్‌లో సాంబారులో తేలి ఆడె ఇడ్లీలా అ స్తమానం నోట్లో తిట్లను తేలి ఆడించే కసాయి ఆఫీసరు దగ్గర అణిగి మణిగి పడివుంటూ, ప్రతి చిన్నమాటకు (తిట్లకు సైతం) "యస్ సార్" అంటూ తలూపే అదృష్టం ఛ...దౌర్భాగ్యాన్ని అంటగట్టింది—వెధవ డిగ్రీ.

అర్జంటు లెటర్స్... పెండింగ్ ఫైల్స్ వాటి మధ్య నేను, ఓ పెండింగ్ ఫైల్ లాంటి జీవితాన్ని గడిపే గుమస్తాని అనుకున్నప్పుడు, తీరిక టైము దొరకనివాణ్ణి.

మూడోరోజు ఎలాగైతేనేం ఆరు గంటలకల్లా యిల్లు చేరుకొని కాఫీ తాగి బయలుదేరబోతున్న నేను, అమ్మచెప్పిన వార్త వింటూనే నిశ్చేష్టగా నిలబడి పోయాను. కుర్చీకతుక్కుపోయికూర్చున్న నా కళ్ళకు, శేషాద్రి అమాయకపు మొహం, ఆ ప్రక్కనే శాయిలక్ష్మి మొహంలో కదిలే గర్వం కనిపించాయి.

ఓ సంగనాచికి మొగుడైన నేరానికి శేషాద్రిని, వాడి అమాయకత్వాన్ని కసిదీరా తిట్టుకున్నాను. వెర్రిపీనుగ, వాజమ్మ అమాయకుడు అన్యాయం అయిపోయాడనుకున్నాను. అమ్మమాత్రం, "అకాలంరా బాబూ!" అంది.

శేషాద్రి శాయిలక్ష్మికి మేనబావ. శేషాద్రికి తల్లితప్ప తండ్రి లేడు. కాస్త మిగిలిన ఆస్తిని, కొడుకుని, తమ్ముడికి అప్పగించేసింది రాజమ్మ. "నీకెందుకూ? నీ కొడుకును వృద్ధిలోకి తెచ్చే పూచీ నాది" అంటూ హామీ యిచ్చాడు శాయిలక్ష్మి తండ్రి రాఘవయ్య.

శేషాద్రి మనిషి అనడానికి ఎవరికి అభ్యంతరం వుండదు. కాని వాడితత్వం మాత్రం, గంగిగోవులాంటిది. మూగజీవిలాంటిది. వాడి నాలుకకు పదును లేదు. అంటే మాటలు రావని కాదు. కాని మరీ బిడియస్తుడు. భయస్తుడు.

శేషాద్రికి చిన్నప్పటినుండి శాయిలక్ష్మి అంటే భయమో, గౌరవమో నాకింతవరకూ అర్థం కాలేదు. కాని వాడి మాటల్లో, శాయిలక్ష్మి వాడికంటే, ఇంకా కొంతమందికంటె చాలా తెలివైందని, చాలా విషయాలు తెలుసని, ఎంతో లోతుగా ఆలోచిస్తుందని అనిపిస్తుంది ఎదుటి వాళ్ళకు. నా మటుకు నాకు మాత్రం, శాయిలక్ష్మి అభిప్రాయాలు, ఆలోచనలు, ఎప్పుడూ సబబుగా తోచలేదు. కాని శేషాద్రికి మాత్రం శాయిలక్ష్మి మాట వేదవాక్కు.

శాయిలక్ష్మి ఏది చెప్పినా గంగిరెద్దులా తలూపే శేషాద్రి శాయిలక్ష్మికి ఓ ముద్దు బసవడిగా, ముద్దబ్బాయిగా అనిపించేవాడేమో! ముద్దబ్బాయిని కూర్చోబెట్టుకొని తలబద్దలు కొట్టుకునే మాస్టారిలా అర్థం అయినా కాకపోయినా, శేషాద్రి బుర్రలోకి ఏమిటేమిటో ఎక్కించాలని ప్రయత్నించేది. అది వినడం అవసరమా, కాదా, అర్థం అవుతుందా లేదా అని ఆలోచించకుండా, బుద్ధిగా వినేవాడు శేషాద్రి.

శేషాద్రి శాయిలక్ష్మికంటె పెద్దవాడు. శేషాద్రి తరువాత ఆడపిల్ల పుడుతుందనుకున్న రాజమ్మకు భర్త పోవడంతో ఆ కోర్కె తీరకుండా పోయింది. ఆడపిల్ల పుట్టలేదన్న బెంగ, దిగులు, ఆశ, కోర్కె శేషాద్రికి ఆరేళ్ళు వచ్చేవరకూ ఫ్రాకులు, పరికిణీలు తొడిగి, క్రాపు చేయించకుండా రెండుజడలు వేసి, నిండుగా పూలుపెట్టి, బొట్టు కాటుక పెట్టి తన ముద్దు మురిపెం తీర్చుకుంది రాజమ్మ. శేషాద్రికూడా అభ్యంతరం పెట్టలేదు. అతడికి చిన్నప్పటినుండి ఆ బట్టలు వేసుకోవడమే అలవాటైంది. పైగా శేషాద్రి ఆడపిల్లలకంటె అందంగా, నాజూకుగా. పొడుగ్గా వుండేవాడు మరి.

శేషాద్రి బళ్ళో చేరిన రెండేళ్ళకు శాయిలక్ష్మి బళ్ళో చేరింది. ఇద్దరు కలిసి బడికి వెడుతుంటే ఊరి దార్లోనూ, అటు క్లాసులోను అందరూ వెక్కిరించి ఏడిపిస్తే, పరికిణీతో కళ్ళు తుడుచుకునేవాడు శేషాద్రి.

కాని శాయిలక్ష్మి వెక్కిరించలేదు. ఓదార్చింది. అప్పుడే సరిగ్గా ఆ క్షణంలోనే శేషాద్రి పసిమనసులో శాయిలక్ష్మి మంచితనం ముద్రపడింది.

"నువ్వెంత మంచిదానివి శాయీ!" అన్నాడు కృతజ్ఞత నిండిన కళ్ళతో.

కాని ఓ నెలరోజులపాటు ఊరుకున్న శాయిలక్ష్మికి, అంతవరకు శేషాద్రికి రాని సిగ్గు, రోషం వచ్చాయి.

"నిజంగా నేనే మంచిదాన్నయితే, నాతోనే జట్టుగా వుండాలనుకుంటే, రేపటిలోగా క్రాపు చేయించుకొని అబ్బాయిలా మారిపోవాలి. లేకుంటే నీకు నాకు పచ్చి" అంది శాయిలక్ష్మి బెదిరించే ధోరణిలో.

శాయిలక్ష్మితో తప్ప మరెవ్వరితో ఆడుకోని శేషాద్రి ఒక్కపూటంతా ఏడ్చి ఏడ్చి మర్నాటికల్లా అబ్బాయిలా మారి పోయాడు.

"శేషూ! నువ్వు మగపిల్లాడివి. లాగు చొక్కా వేసుకొని, పరికిణీలు వేసుకునే అమ్మాయిలతో తొక్కుడుబిళ్ళ ఆడ కూడదు. ఎంచక్కా గోళీకాయలు, బొంగరంఆట ఆడుకోవాలి ఏం?" అంటూ ఏడేళ్ళ శాయిలక్ష్మి మాటలకు తొక్కుడు బిళ్ళ ఆడ్డానికి సిద్ధపడ్డ శేషాద్రి బుద్ధిగా తలూపి వెనక్కి తిరిగి వచ్చేసాడు.

చిన్నప్పటి నుండి శాయిలక్ష్మి చదువులో, శేషాద్రికంటె కాస్త వెనుకే. మాటల్లో కనిపించే చురుకుతనం, ఆలోచనలలో కనిపించే విస్తృత భావపరిధి చదువులో అంతగా వుండేదికాదు.



శేషాద్రి క్లాసులో ఫస్టు వచ్చేవాడు. ఈ విషయంలో శేషాద్రికంటె ఎక్కువగర్వ పడేది శాయిలక్ష్మి. ప్రతినెల మార్కుల రిపోర్టులో శేషాద్రి మార్కులు చూసి, తన స్నేహితురాళ్ళతో, "బావ ఫస్ట్ వచ్చాడు తెలుసా?" అని చెప్పి శేషు భుజంమీద చేయివేసి గర్వంగా చూసేది. ఈర్ష్యపడని శాయిలక్ష్మి అంటె శేషాద్రికి చాలా ఇష్టం.

అయితె శేషాద్రి చదువులో యెంత తెలివిగలవాడో, యెదుటివాళ్ళు నమ్మలే నంత అమాయకత్వంఉండేది మొహంలో. చివరికి రాజమ్మకూడా శేషాద్రి తెలివికల వాడంటె నమ్మేదికాదు.

"అత్తా! బావ క్లాసులో ఫస్ట్" అంటూ చెప్పిన శాయిలక్ష్మి మాటలకు.

"వెర్రి నాగన్న! ఎలా చదువుతు న్నాడో యేమో! ఎలా బ్రతుకుతాడో" అంటూ దిగులు, ప్రేమ కలిపితె వచ్చె భావంతో శేషాద్రి వంక చూసే ఆమె మాటలకు అర్థం బోధపడక, "అసలు అత్తయ్యా వొట్టి వెర్రిబాగుల మనిషి" అన్న రిమార్కు పారేసింది శాయిలక్ష్మి చాలా చిన్నవయసులోనే.

"వాడి మొహం! వాడు ఫస్టురావడ మేమిటి? ఏదో మాస్టార్లు వాడి అమాయ కత్వం చూసి దయగా మార్కులు వేసేస్తె ఫస్టురాడు మరీ" అంటూ తేలిగ్గా మాట్లాడె తండ్రిని చురచుర చూస్తూ__ "నాన్నా! మాస్టార్లకు దయ కలిగితె బెంచి యెక్కించరు, గోడకుర్చి వేయిం చరు, గుంజీళ్ళు తీయించరు. కాని మార్కులుమాత్రంయెనభైలు, తొంభైలు తేలిగ్గా వేయరు. బావ అంటె నీకు దయేగా. మొన్న సర్కస్‌కు అర్ధ రూపాయి ఇవ్వలేదేం? నువ్వే ఇవ్వలేదు కాని యెవరో మాస్టార్లు దయగా మార్కులు వేసేస్తారట" అంటూ నిలదీసి అడిగె కూతురును చూసి తెల్లమొహం వేసేవాడు రాఘవయ్య.

ఒక్క చదువు విషయంలో తప్ప, మరే విషయంలోనైనా, శేషాద్రి అమా యకుడని యెవరైనా అంటె, తెగ బాధ పడిపోతూ, తనకు తెలిసిన విషయాలన్నీ శేషాద్రికి చెప్పేది. కాని ఒక్కోసారి శేషాద్రి అమాయకత్వం, దాన్ని మించిన మంచితనం చూస్తుంటె శాయిలక్ష్మికి బోల్డంత కోపం వచ్చేది.

ఓసారి__

ప్రక్కింటి సరోజ హోంవర్కు చేయక, శేషాద్రి దగ్గరికి వచ్చి, లెక్కలు చెప్పించుకొని వెళుతూ, 'నువ్వు చాలా మంచివాడివి శేషూ!' అంది. సరోజవచ్చి నపుడు శాయిలక్ష్మి ఇంట్లోలేదుకాని, వెళ్ళే సమయానికి వచ్చేసింది సరోజ మాటలు విని, తనతో పోట్లాడి. మాట్లాడ్డం మానే సిన సరోజకు శేషాద్రి లెక్కలు చెప్పడం తనను అవమానం చేయడమే అన్నంతగా బాధపడిపోయింది.

ఒంటరిగా మాట్లాడకుండా కూర్చున్న శాయిలక్ష్మి ధోరణి అర్థం కాక "మాస్టారు కొట్టారా?" అన్నాడు శేషాద్రి.అప్పుడప్పుడు, మాస్టారు కొడితే బళ్ళో మౌనంగా వుండి, యింట్లో అలిగి కూర్చోవడం శాయిలక్ష్మికి అలవాటన్న విషయం తెలిసి.

"లెక్కలు సరిగ్గా చేయలేదా? నేను చెప్పనా?" అన్నాడు.

"ఊఁ...మహా బాగా నీకే లెక్కలు వస్తాయనా? నాకేం కాలేదు. నువ్వనుకు న్నంత మొద్దావతారాన్నేంకాను నేను," అంది కోపంగా చిరాకు పడిపోతూ.

నోరు తెరిచాడు శేషాద్రి.

"నాకు లెక్కలు రాకపోతేనేం? మాస్టారు కొడితే నన్నే కొడతారు. వెళ్ళి వూళ్లోవాళ్ళందరికి చెప్పిరా నీకు వచ్చే లెక్కలని. నాకేం చెప్పనక్కర్లేదు. బోడిపెత్తనం!" అంది విసురుగా శాయి లక్ష్మి. అందులో 'పెత్తనం' అనేమాటకు అర్థం తెలీని శేషాద్రి నిర్ఘాంతపోయి, తల్లి దగ్గరికి వెళ్ళిపోయాడు.

"ఎందుకే శాయీ! శేషు యేడుస్తున్నాడూ? నువ్వు బావా పోట్లాడుకున్నారా?" అంది రాజమ్మ యేం చెప్పకుండా బావురుమన్న శేషాద్రిని చూసి.

"నేనేం పోట్లాడలేదు అత్తా! అసలు బావ యేం చేసాడో నీకు తెలుసా?" అంది శాయిలక్ష్మి కోపంగా. శేషాద్రిని వెనకేసుకొచ్చే శాయిలక్ష్మి అంతకోపంగా అనడంతో, నిజంగానే శేషాద్రి యేదో చేశాడని భయంగా చూస్తూ–


"ఏం చేశాడే శాయీ? వాడొట్టి వెర్రినాగన్నా..." అంటూ యేదో అంటున్న రాజమ్మ ధోరణికి చిరాకు పడిపోతూ, మింగేసేలా చూసింది శాయి లక్ష్మి.

"మొన్న సరోజ బావను వెక్కిరించింది. బావ యేం అన్లేదు. నేను పోట్లాడాను. తిరిగి ఇవ్వాళ, బావ సిగ్గులేకుండా సరోజకు లెక్కలు చెప్పాడు" అంది.

"నిన్ను వెక్కిరించే ఆ సరోజకు యెందుకు చెప్పావురా లెక్కలు?" అంది. రాజమ్మ.

"వచ్చి చెప్పమని అడిగిందే అమ్మా!" అన్నాడు శేషాద్రి అమాయకంగా.

"అందుకని, చెప్పడమే. శాయికి కోపం వచ్చింది చూడు!" అనిఅంటున్న తల్లిమాటలకు, తనది తప్పే అన్నట్టుగా తలూపే శేషాద్రిని చూసి విసుక్కుంది శాయిలక్ష్మి.



"గంగిరెద్దు!" అని కసిగా గొణు క్కుంది.

"ఆ తెయ్యా చెపితేకాని తెలీదు. మొద్దురాచిప్ప" అంది విసురుగా.

ఇంకోసారెప్పుడు, శాయిలక్ష్మి మాట లాడని వారి కెవ్వరికి లెక్కలు చెప్పడం కాని, నోట్స్ ఇవ్వడంకాని చేయనని ఒప్పుకున్నాడు శేషాద్రి.

మరోసారి యెదురింటి రామానికి ఇంగ్లీష్ రాదంటె చెప్పాడు.

"నువ్విలా నీకు వచ్చినవన్నీ చెబితే నువ్వు క్లాసులో ఫస్ట్ రావు" అంది శాయి లక్ష్మి.

"రామంమంచివాడు! నీతో మాట్లాడు తాడుగా!" అన్నాడు శేషాద్రి.

"అయితే యేమిటి?"

"మరి రామానికి రానివి చెప్పాను. పాపం! ఫెయిలవుతాడుకదూ" అంటూ జాలిపడే శేషాద్రిని చూసి, "మాస్టారు చెప్పినపుడు సరిగ్గా వింటె ఎవ్వరికైనా వస్తుంది. క్లాసులో వినకుండా యెందు కూర్చోవాలి? అది తప్పుకదూ? అలాంటి వారసలు ప్యాసవకూడదు" అంది శాయి లక్ష్మి.

నిజమే. రామం క్లాసులో పాఠాలు సరిగ్గా వినడు. కలవారిబిడ్డ. క్లాసులు ఎగ్గొట్టి చెరువుగట్టు వెంట తిరిగేంత గారా బంగా పెంచారు ఇంట్లోవాళ్లు. కాని పరీక్షలనగానే ప్యాసవ్వాలనుకుంటూ అందరి ఇళ్ళమీదికి, ముఖ్యంగా శేషాద్రి ఇంటిమీదికి పరుగెత్తుతాడు. మొదట్లో రామంతో, శేషాద్రి మాట్లాడ్డమే సహిం చేదికాదు శాయిలక్ష్మి. కాని రామం పిలి చినా యెక్కడికి వెళ్ళని, బుద్ధిమంతు డైన శేషాద్రిమీద నమ్మకంతో మాట్లా డితే అడ్డుకునేదికాదు.

క్లాసులో వినికూడా అర్థంకాని మొద్దు బుర్రలకు, పుస్తకాలు లేక చదవలేని వాళ్ళకు, శ్రద్ధవుండిఅవకాశంలేనివాళ్ళకు సహాయం చేయాలి కాని, రామం లాంటి వాళ్ళకు చేయడం ఘోరమైన తప్పు అన్యాయం అనే శాయిలక్ష్మిది సూటి మన స్తత్వం. ధైర్యం యెక్కువే. ఏమాట కాని, మొహమ్మీదే రపీమని అనేస్తుంది. స్కూల్లో యెదుటి పిల్లలు కొట్టినా, వెక్కిరించినా, మౌనం వహించే శేషు లోని అమాయకత్వం, బలహీనత శాయి లక్ష్మిలో లేవు. శేషు తరఫున తానే నాలుగు తగిలించి, వీలైతే, పుస్తకాలు విసిరేసి పరికిణీ దోపుకొని, ముష్టియుద్ధా ల్లాంటివి చేసి, కుర్రాళ్ళను సైతం చిత్తుగా తన్నిన సందర్భాలు వున్నాయ్. దెబ్బకు దెబ్బ తీసేవరకు, వూరుకునేదికాదు. ఇక పోట్లాడుకోవడంలో శాయిలక్ష్మి గొంతు చెప్పుకోవాలి.

చాలాసార్లు శేషాద్రి-"నువ్వు సంగీతం నేర్చుకో శాయి. నీ కంఠం చాలాబావుం టుంది. గట్టిగా పాడగలవు కూడా" అని అంటున్నప్పుడు మింగేసేలా చూడ బోయి, శేషాద్రి మొహంలో కదిలే అమాయకత్వాని చూసి తమాయించు కునేది. ఇదంతా చిన్నప్పటి జీవితం.

రెండు సంవత్సరాల తేడాలో శేషాద్రి శాయిలక్ష్మి కాలేజీలో చేరారు. శాయి లక్ష్మి చేరిన నెలరోజుల్లో, అందరికి శాయి లక్ష్మి పేరు తెలిసిపోయింది.

శాయిలక్ష్మి అందమైంది. అంతకంటె

అందమైనవి ఆమె రెండు కళ్లు. ఎప్పుడూ హుషారుగా, చలాకీగావుండి అల్లరిగా మాట్లాడే శాయిలక్ష్మి అంటె చాలామంది అబ్బాయిలకు ఇష్టంవున్నా, పరిచయం పెంచుకోవాలన్నా, తమ స్నేహాన్ని ప్రకటించాలన్నా, శాయిలక్ష్మి అంటె ఓ విధమైన భయంతో ఆగిపోయారు.

కారణం—

శాయిలక్ష్మి కాలేజీలో చేరిన నెలరోజులకే, లైబ్రరి మెట్లదగ్గర పరధ్యానంగా నడుస్తూ, ఢీకొట్టిన అబ్బాయి చెంప ఛెళ్లు ఛెళ్లుమనిపించింది. వెనక కుర్రాళ్లు ఆ అబ్బాయి చేసిన దానికి ఉత్సాహంగా అరిచినా, ఆ వెనుకే వినిపించిన ఛెళ్ళు ఛెళ్ళుమన్న శబ్దంతోపాటు, తిరిగి వచ్చిన ఆ అబ్బాయి రెండుబుగ్గలమీద యెర్రటి వాతలనుచూసి "నాయనోయ్ ఢీకొడితే నొసలు యేమాత్రం అదృష్టానికో నోచుకున్నా, బుగ్గలుమాత్రం నూనెలో వేయకుండానే ఉబ్బిపోయే బూరులవుతాయిరోయ్" అంటూ హడలిపోయారు.

"శాయి, నువ్వలా చేయి చేసుకోవడం నాకు నచ్చలేదు" అన్నాడు విషయం తెలిసిన శేషాద్రి.

"నీ కసలు బుద్ధిలేదు శేషూ! ఎవరో పరాయి మగాడు అలా చేసినందుకు వెళ్ళి యెముకలు విరగ్గొట్టే మగాళ్ళను చూసాను కాని, నీలాంటి వాణ్ణి చూడలేదు" అంది కోపంగా.

"సూరి అలాంటివాడు కాదు శాయీ! వాడికి పరధ్యానం యెక్కువ. వాడొక్కడే నా స్నేహితుడు. ఎవరో వాణ్ణి కొడితే బాధపడేవాణ్ణి కాదు. నువ్వే కొట్టావని తెలిసి..." అని అంటున్న శేషాద్రి మాటలకు సిగ్గుపడిపోయింది శాయిలక్ష్మి.

రెండేళ్లు గడిచినా, ఏ ఒక్క అమ్మాయిపేరు సరిగ్గా తెలీని శేషాద్రి స్నేహితుడ్ని తను కొట్టానని తెలిసి శేషాద్రి స్నేహితుడంటే అతి వెలాంటి వాడో అర్థంచేసుకున్న శాయిలక్ష్మి శేషాద్రి ఎదురుగానే సూరికి క్షమాపణ చెప్పుకుంది.

మెచ్చుకోలుగా చూసాడు శేషాద్రి.

కాని—

మరోసారి అప్పుడే మెట్లదగ్గర సూరితో మాట్లాడి వెనుతిరుగుతున్న శాయిలక్ష్మిని ఎవరో తాకడంతో తలెత్తి చూడకుండానే చాచి లెంపకాయ కొట్టింది.

చెంపపట్టుకుని నిలబడ్డ శేషాద్రిని చూస్తూనే శాయిలక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మొహం చూపించలేనట్టుగా పరుగులాంటి నడకతో వెళ్ళిపోయింది.

"ఓర్నాయనోయ్! బావను కైతం లెక్క చేయకుండా కొట్టింది. ఆఅమ్మాయి చేయి మరీ లూజ్ రా... తాకితే చాలు చెంపలమీద డాన్స్ చేస్తుంది" అంటూ జాగ్రత్తపడిపోయారు, శాయిలక్ష్మి అంటే గుటకలు వేసే వాళ్ళంతా. వేద్దామన్న అడుగు వేయకుండానే మరకొన్ని అడుగులు వెనక్కి వెళ్ళిపోయారు.

కాని శేషాద్రిని కొట్టినందుకు, శాయిలక్ష్మి మాత్రం బాధపడి పోయింది, "నన్ను క్షమించకు బావా నన్నుకూడా కొట్టు" అంటూ బావురుమని ఏడుస్తున్న శాయిలక్ష్మిని చూసి, "పోన్లెద్దూ' ఈ విధంగానైనా నీ గురించి వాళ్ళ వాళ్ళ

"నోళ్ళు మూతబడిపోతాయ్!" అన్నాడు క్షమించేస్తూ శేషాద్రి.

ఓసారి శాయిలక్ష్మికి ఓ ప్రేమలేఖ వచ్చింది. ఆ ఉత్తరం రాసిన దౌర్భాగ్యుడి పేరు శ్రీధర్. డిబార్ అయ్యేవరకు వెళ్ళింది వ్యవహారం. శేషాద్రికోసం, శ్రీధర్ డిబార్ కాకుండా రక్షించింది. అయినా, ఆ వ్యవహారం ప్రిన్స్‌పాల్ వరకు వెళ్ళినందుకే బాధపడ్డాడు శేషాద్రి.

"బావా! ఈ కుర్రాళ్ళకిదో తెగులు. నీ మొహంచూసి, డిబార్ చేయించడానికి ఒప్పుకోలేదు. అందమైన అమ్మాయి కనపడగానే ప్రేమలేఖ రాయడం, ప్రేమా దోమా అంటూ మాటలతో బురిడీ కొట్టించడం, పెళ్ళనగానే పలాయనం చిత్తగించే ఈ పిరికి రోమియోలకు యిలాగే బుద్ధిచెప్పాలి. శ్రీధర్ నాకే కాదు, నాకంటే ముందు రాజ్యానికి రాసాడు. రాజ్యం నీకు తెలుసుకదూ? జ్ఞాపకం లేదనుకుంటూ" అంది తెలియకున్నా తలూపుతున్న శేషాద్రి వాలకాన్ని చూసి.

"వరసగా వారానికి నాలుగు చొప్పున పదహారు రాసాడు. ఒక్కదానికి జవాబివ్వకుండా నేనే అడ్డుకున్నాను. చివరికి ఓసారి జవాబివ్వనందుకు బెదిరించాడట దార్లో అడ్డగించి."

"ఈ విషయం ముందుగానే ఊహించి రాజ్యానికి ఓ సలహా చెప్పాను. అతనలా బెదరించగానే, యింటికి వచ్చి నాన్నతో మాట్లాడండి. నాకు యిష్టమే మీరంటే" అనే మాట చిలకలా పలికిన రాజ్యం మాటలకు శ్రీధర్ రూట్ మార్చుకొని నాకు రాశాడు. పిరికి సన్నాసి" అంది కసిగా.

"నీకు రాధ తెలుసా! ఒహో తెలీదు కదూ! దానికి యిలాగే ఓసారి ఓ ప్రబుద్ధుడు ఉత్తరం రాస్తే అది ఉబ్బి తబ్బిబైపోతూ, జవాబు రాసింది. మరునాటికల్లా, ఆ పిచ్చి వెధవ అందరికి ఆ విషయం చెప్పడంతో కాలేజి గోడలమీద పేర్లు వెలిసాయి. ఈ విషయం నీకు తెలుసుగా! పాపం రాధా వాళ్ళింట్లో ఆ విషయం తెలిసి, కాలేజి మాన్పించేసారు. చదువు పూర్తికాకుండానే పోయింది. యింతవరకూ పెళ్ళికాలేదు"

"పెళ్ళి చేసుకునే ధైర్యంలేని వాళ్ళెప్పుడూ ప్రేమించకూడదు!" అంది శాయిలక్ష్మి తన సిద్ధాంతాన్ని గట్టిగా చెబుతూ.

"నిజంగానా!" అన్నట్టు చూసే శేషాద్రిని చూసి చిరాకుపడిపోతూ "నీకసలు ఏం తెలీదు బావా" అంది విసుక్కుంటూ.

"అంతేకాదు – నువ్వింత అమాయకంగా, ఎదుటి వాళ్ళు చెప్పేవరకు కూడా గ్రహించలేక, ఆలోచించలేక బుద్ధావతారంలా వుంటే, నిన్ను ఏ అమ్మాయి పెళ్ళిచేసుకోదు. చేసుకున్నా, సుఖపడదు. నాలాంటిదైతే అసలు నీలాంటి వాణ్ణి, నీ అమాయకత్వాన్ని భరించలేదు" అంటూ రిమార్కు పారేసింది.

శేషాద్రి నవ్వాడు.

శాయిలక్ష్మి బి.ఏ. పూర్తిచేసింది.

శేషాద్రి ఎమ్.ఏ. పూర్తిచేసి, హైద్రాబాద్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

శేషాద్రికి బి.ఏ.లో క్లాస్ మేట్‌ని నేను. శాయిలక్ష్మి విషయం అంతా కాలేజిలో చూసి, కొద్దిగా శేషాద్రి చెప్పడం

ద్వారా, మరోసారి వాడితో పాటు వాళ్ల ఊరికి వెళ్ళడంద్వారా తెలుసుకున్నాను. కాస్త పరిచయం కూడా వుంది.

ఎమ్.ఏ. ఒక్క సంవత్సరమే చదివి మానేసి, ఉద్యోగం వెతుక్కున్న నన్ను, శేషు మర్చిపోలేదు. ప్రతి చిన్న విషయం ఆత్మీయుడిలా చెప్పేవాడు శేషాద్రి.

ఆ మధ్య రాఘవయ్య, శాయిలక్ష్మికి సంబంధాలు చూస్తున్నాడని తెలిసి, రాజమ్మ వెళ్ళి అడిగింది. మేనరికం పోగొట్టుకోవద్దని, బ్రతిమాలింది.

"శేషు మరీ అమాయకుడు అత్తా! ఈ మాట బావ స్వయంగా వచ్చి అడిగే ధైర్యం లేక నిన్ను పంపించాడేం?" అంది శాయిలక్ష్మి.

"వాడెందుకు అడగాలే? వాడు నీ బావ. నువ్వు పుట్టగానే వాడి పెళ్ళాని వైపోయావ్. నీమీద వాడికి హక్కు వుంది. దేవిరించినట్టు ఎందుకు అడగాలేం?" అంది రాజమ్మ.

"అబ్బా ..బోడి హక్కు ..ఎక్కడుందేం? అయినా. ఆ హక్కు వినియోగించుకునే ధైర్యంలేని నీ కొడుకులాంటి పిరికివాణ్ణి నేను కట్టుకోను. వెళ్ళి చెప్పు" అంది శాయిలక్ష్మి ఖచ్చితంగా.

రాజమ్మ ఈ విషయం అంతా వివరిస్తూ శేషాద్రితో చెప్పడం విన్న నేను, "హమ్మ ఆడదికాదురా" అనుకున్నాను. కాని శేషాద్రి మాత్రం ఎందుకో ఉలిక్కిపడిపోయాడు.

శాయిలక్ష్మికి సంబంధం కుదిరిందని, తెలిసిన రోజు రాజమ్మ బాగా ఏడ్చింది. శేషాద్రి విగ్రహంలా కూర్చున్నాడు. వాడి వాలకం చూస్తుంటే బాధపడుతున్నాడో లేదో అర్థం కాలేదు. కాని, ఓ రెండు రోజులు మాత్రం మనిషి కనిపించకుండా గాబర్గా పెట్టేసాడు శేషాద్రి.

ఆ తరువాత వారం రోజులు గడిచాయి. నేను ఆ వారంరోజులుగా ఆఫీసులో పని మరీ వొత్తిడిగా వుండడంతో వెళ్ళలేక పోయాను. ఇంతట్లో నే ఈ వార్త.

పెళ్ళయిపోయింది.

శాయిలక్ష్మికి శేషాద్రికి పెళ్ళయిపోయింది.

ఎలా?

శాయిలక్ష్మి ప్రేమించిందిట ఓ డాక్టర్ని. అతగాడితోనే పెళ్ళి నిశ్చయం చేసాడట రాఘవయ్య. అందుచే నీ కొడుకును చేసుకోను పో అందిట శాయిలక్ష్మి.

మరి ఈ పెళ్ళెలా జరిగింది?

నేను యింకెంతోసేపు కుర్చీ కతుక్కొని కూర్చోలేక లేచి బయలుదేరాను. నేను వెళ్ళేసరికి, శాయిలక్ష్మి ఎదురైంది. నన్ను కూర్చోమని చెప్పి "శేషూ! రాజు వచ్చాడు" అంటూ కేక పెట్టిన శాయిలక్ష్మి కేకకు ఐదు నిమిషాల్లో వచ్చేసాడు శేషాద్రి.

ఇద్దరం పార్కువైపు బయలుదేరాం.

"శాయిని నేను ప్రేమించానురా రాజూ! కాని మామయ్య కాదంటాడని దానికి శాయివంత పాడుతుందని అనుకోలేదు. కాని అమ్మ వచ్చి శాయి అన్నమాటలు చెప్పాకా, ప్రేమించిన శాయికోసం నేనేం చేయాలో నిర్ణయించుకున్నాను."

"అందుకే ఆ రెండు రోజులు శాయి

దగ్గరికి వెళ్ళి అడిగాను.''

''ఏమనీ?'' అన్నా న్నేను నోరు తెరుస్తూ. పత్తాలేకుండా రెండు రోజులు వెళ్ళి ఫ్రెండింట్లో వున్నానని నన్ను సైతం నమ్మించినవాడి తెలివికి ఆశ్చర్య పోతూ.

''నన్ను తను ప్రేమిస్తోందా లేదా అని-నన్ను ప్రేమిస్తోందట కాని పెళ్ళి మాత్రం చేసుకోనంది. నిజం చెప్పొద్దూ బోల్డు కోపం వచ్చింది. నేనెప్పుడూ శాయిని కొట్టలేదు కాని ఆరోజు రెండు బుగ్గలూ కందిపోయేలా కొట్టాను.''

''మామయ్యా కళ్ళప్పగించి చూస్తున్నా ఏమిటో వెర్రి ఆవేశం, నాలో ధైర్యంగా విజృంభించింది. శాయి నాతో చెప్పిన ఒకమాట తిరిగి అప్పగించేసి, లాక్కు రావాలనుకున్నాను. కాని, శాయి కిష్టం లేకుండా, నేను శాయిని పెళ్ళిచేసుకో లేను. అందుకే వచ్చేసాను.''

''కాని... చిత్రం ఏమిటో తెలుసా! శాయి చాలా మంచిది.'' అన్నాడు శేషు.

వెర్రిగా చూసాను. అదేనా-చిత్రం? అన్నట్టుగా.

''అమ్మ వెళ్ళి, నీ కూతురుకు పెళ్ళెలా చేస్తావో నేను చూస్తాను. నాకొడుక్కేం తక్కువా అని అంటే, మావయ్యా వెక్కి రిస్తూ, ''పిరికి సన్నాసి! వాడు నా కూతురు నేం చేయలేడు. తాకి బతగ్గలడా? అని అన్నాడట. అమ్మకంటే ఎక్కువ రోషపడిపోయింది శాయిలక్ష్మి. అందుకే అమ్మతో నా హక్కు, ధైర్యం గురించి సవాలుచేస్తున్నట్టు మాట్లాడిందట. నేను వెళ్ళి వచ్చేసాకా, ''రౌడీ వెధవ వాడి ధైర్యం మండిపోను. చెట్టంత మనిషిని ఎదురుగా వున్నా నన్ను భయంలేక ఎంతపని చేసాడు'' అని అంటున్న తండ్రి మాట లకు సమాధానంగా, ఆ మర్నాడే శాయి నాకు ఉత్తరం రాసింది. తాను వచ్చే స్తున్నట్టు. మామయ్యా మాటలకు ముందుగా ఏడ్చినా, అమ్మ బిగుసుకుపోయి, శాయి మీద మనసు మార్చుకొని ఆపేరే ఎత్తకూడదంది. అందుకే అమ్మకు కూడా తెలీకుండా, శాయి ఇక్కడికి రాగానే వెంటనే పెళ్ళిచేసుకొని యింటికి తీసు కొచ్చారా. అమ్మ ఏం అన్లేదు. కాని మామయ్యా మాత్రం, నిన్న వచ్చి అల్లరి పెట్టి, నేను శాయిని లేవదీసుకొచ్చానని అన్నాడు. పాపం! మావయ్యా కేం తెలీదు.'' అని చెప్పి జాలిపడుతున్న శేషాద్రివంక కళ్ళు పెద్దవిచేసి చూసాను.

''ఎవరు ఎవరిని పెళ్ళి చేసు కున్నారూ?'' నా మెదడులో తొలు స్తున్న ప్రశ్న అప్రయత్నంగా నాకు తెలీ కుండానే వెలువడింది.

''ఒకరు యింకొకరిని చేసుకోవడం ఏమిట్రా? మేమిద్దరం పెళ్ళిచేసుకున్నాం అంతే-'' అన్నాడు శేషాద్రి నవ్వుతూ. 'మేమిద్దరం' అనే చోట నొక్కి పలుకుతూ.

నిజమే—

వాళ్ళిద్దరూ— శేషాద్రి శాయిలక్ష్మి ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. సుఖాంతంగా పెళ్ళితో ముగించారు వాళ్ళ ప్రేమకథని. ఇది-ఓ ప్రేమకథేనా? అన్పించింది నాకు.

శాయిలక్ష్మి ఒకప్పుడు శేషాద్రితో అన్నమాటలు గుర్తుకువచ్చి నా ప్రశ్నకు జవాబు దొరికింది. ★